
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప జిల్లా వార్తలు
5
సోమవారం 11 నవంబరు 2024



సోలార్‌తో ప్రయోజనాలు అధికం



● జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ

ఫటాఫట్

కడప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌కోసం ఏర్పాటుచేసుకునే సోలార్ సిస్టంతో ప్రయోజనాలు అధికంగా ఉంటాయని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. గృహ వినియోగదారులు అధికారుల సూచనలు పాటిస్తే విద్యుత్ ఆదా చేయవచ్చునని చెబుతున్న ఎస్ఈ రమణతో ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూ.

ప్రశ్న: పీఎం సూర్య ఘర్ పథకం గురించి..

జవాబు: జిల్లాలో మొత్తం 1770 మంది వినియోగదారులు సోలార్ పలకల కోసం నమోదు చేసుకున్నారు. వీరిలో 636 మంది సోలార్ పలకలు ఏర్పాటు చేసుకునేందుకు అన్ని విధాలుగా పూర్తిచేసుకుని కాంట్రాక్టర్‌ను ఎన్నుకున్నారు. వీటిలో 165 మందికి సంబంధించిన పనులు పూర్తయ్యి 50 మందికి సబ్సిడీ కూడా వారి అకౌంట్‌లో జమ అయింది. సోలార్ ఏర్పాటు వల్ల గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లులు తగ్గించవచ్చు.

ప్రశ్న: పీఎం సూర్య ఘర్ సబ్సిడీ వివరాలు తెలపండి?

జవాబు: గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఒక కిలోవాట్ సామర్థ్యానికి రూ.30వేలు, రెండు కిలోవాట్స్ సామర్థ్యానికి రూ.60వేలు, మూడు కిలోవాట్స్‌కు రూ.78వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రాయితీపోను మిగిలిన మొత్తానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు ఇస్తున్నారు.

ప్రశ్న: విద్యుత్ బిల్లులు తగ్గించుకునేది ఎలా?

జవాబు: నాసిరకమైన గృహ ఉపకరణాలు తీసుకోవడం వల్ల అధిక విద్యుత్ బిల్లులు వస్తుంటాయి. వీటిని నివారించేందుకు బీఈఈ స్టార్ రేటెడ్ గృహ ఉపకరణాలు కొనుగోలు చేయాలి. ఏసీలను 24డిగ్రీల ఉష్ణోగ్రత కంటే ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. సాధారణ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులు వాడాలి. ఫ్రిడ్జ్ డోర్లు సాధ్యమైనంత తక్కువసార్లు తెరవాలి. ఒకసారి డోర్ తీస్తే అరగంట కూలింగ్ నష్టమవుతుంది. లోడుకు సరిపడా బట్టలు ఉన్నప్పుడు మాత్రమే వాషింగ్‌మిషన్ ఉపయోగించాలి. టీవీలు చూసిన తర్వాత, ఏసీలు వాడిన తర్వాత కేవలం రిమోట్ ద్వారా మాత్రమే ఆఫ్ చేస్తుంటారు. స్విచ్ ద్వారా కూడా కరెంటును ఆపాలి. ఈ సూచనలు పాటిస్తే విద్యుత్ ఆదా అవుతుంది. విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చు.

ప్రశ్న: జిల్లాలో మొత్తం సర్వీసులు, అందించే సేవలు ఏంటి?

జవాబు: జిల్లాలో అన్ని కేటగిరీల కింద 9,43,787 సర్వీసులున్నాయి. ఇప్పుడు కొత్త విద్యుత్ సర్వీసు పొందాలంటే ఆన్‌లైన్‌లో ఏపీఎస్పీడీసీఎల్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా, మీసేవ లేదా సచివాలయం ద్వారా పొందవచ్చు. సంస్థకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే సదుపాయాలు కల్పించాం. వినియోగదారులకు అందించే సేవలు నిర్దిష్ట కాల వ్యవధిలో పూర్తిచేయాలి. లేదంటే సంబంధిత అధికారులు పరిహారాన్ని తిరిగి వినియోగదారునికి చెల్లించాల్సి ఉంటుంది.

ప్రశ్న: రైతులకు మీరు అందించే సేవలు ఏంటి?

జవాబు: రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కావాలంటే 180మీటర్ల మేర లైన్ అవసరమైతే ఒక ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉచితంగా ఇస్తాం. రైతు తమ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి తమ సర్వీస్ నెంబర్ చెప్పి ఫిర్యాదు నమోదు చేసుకున్న 48గంటలలో మారుస్తారు.

ప్రశ్న: విద్యుత్ ప్రమాదాలపై తీసుకునే చర్యలు

జవాబు: అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయి. ప్రతి ఇంటికి ఎర్తింగ్ చేసుకుని సరైన ఫీజులు, ఎంసీబీలు నాణ్యత గల ఇన్సులేషన్ వైర్లు, విద్యుత్ ఉపకరణాలు వాడకం వల్ల అధిక శాతం ప్రమాదాలు నివారించవచ్చు. విద్యుత్ పనులు సొంతంగా చేసుకోకుండా సాంకేతిక నిపుణుల ద్వారా చేయించుకోవాలి.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

ప్రొద్దుటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. రెండు రోజులుగా వరుసగా రేషన్ బియ్యం అక్రమ రవాణా మీద రెవెన్యూ, సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేస్తున్నారు. బియ్యం అక్రమ రవాణా సమాచారం అందిస్తున్నారనే అనుమానంతో రేషన్ మాఫియా దాడులకు తెగబడుతోంది. రెండురోజుల క్రితం మండిబజారులోని వాసవి ట్రాన్స్‌పోర్టు పక్కన గల గదుల్లో అక్రమంగా నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని తహశీల్దారు గంగయ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జున పట్టుకున్నారు. ఈ సరుకు పట్టించారనే అనుమానంతో 22 వ షాపు మాజీ డీలర్ పొట్టి శివపై ఆదివారం సాయంత్రం మీసాల యాదవ్ తన అనుచరులైన మద్దూరు నరేంద్ర, సంజీవ తదితరులతో కలిసి దాడి చేశారు. అవమానకరంగా దుర్భాషలాడుతూ దారుణంగా కొట్టారని శివ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

పులివెందులలో ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు

● ఒకరు జగన్‌కు మేనల్లుడు అర్జున్‌రెడ్డి
● మరొకరు నాటి సకల శాఖామంత్రి కొడుకు సజ్జల భార్గవ్‌రెడ్డి
● మూడో వ్యక్తి సైకో వర్రా రవీంద్రరెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సకలశాఖామంత్రిగా ఖ్యాతిగాంచిన సజ్జల రామకృష్ణారెడ్డి కొడుకు వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి, జగన్ చిన్నాన్న వైఎస్ ప్రకాశ్‌రెడ్డి కూతురు కొడుకైన సింగారెడ్డి అర్జున్‌రెడ్డి, సోషల్ మీడియాలో నీచమైన పోస్టులు పెట్టే సైకో వర్రా రవీంద్రరెడ్డిపై పులివెందులలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వర్రా రవీంద్రరెడ్డి నీచాతినీచంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారు. అతనిపై పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. ఇప్పుడు పులివెందులలోనే ఎస్సీ ఎస్టీ కేసు నమోదైంది. అది కూడా జగన్ సొంత మండలంలోని వ్యక్తులే వ్యతిరేకించడం గమనార్హం. సింహాద్రిపురానికి చెందిన కొండప్పగారి హరి ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

కొండప్పగారి హరి పులివెందులలోని టీడీపీ ఆఫీసులో పనిచేస్తుంటారు. 2023లో వర్రా రవీంద్రరెడ్డి తన ఫేస్‌బుక్‌లో అకౌంటులో కమ్మవారి గురించి, మంద కృష్ణమాదిగ, వంగలపూడి అనిత గురించి నీచమైన పోస్టులు పెట్టాడు. దీనిపై ఆవేదనకు గురైన కొండప్పగారి హరి అప్పట్లోనే తమ స్నేహితులైన మహేశ్, ప్రసాద్‌తో కలసి పులివెందులలో అంకాలమ్మగుడి వద్ద జయమ్మకాంప్లెక్స్ వద్ద ఉన్న వర్రా రవీంద్రరెడ్డి వద్దకు వెళ్లారు. చంద్రబాబు, మందక్రిష్ణ మాదిగకు వ్యతిరేకంగా పెట్టిన పోస్టులు తీసివేయాలని కోరగా.. అతను కులంపేరుతో దూషించడంతో పాటు పోస్టు తీయాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని లేదంటే నిన్ను చంపి పాతిపెడతా అంటూ బెదిరించాడు. దీంతో వీరు భయపడి వచ్చేశారు. ప్రభుత్వం మారడంతో దీనిపై మరింత లోతుగా విచారించగా.. వర్రా రవీంద్రరెడ్డి పోస్టుల వెనక గజ్జల భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డి మరియు వైసీపీ సోషల్ మీడియా టీం ఉందని కొండప్పగారి హరి గుర్తించారు. ఈ మేరకు తనను చంపుతానని బెదిరించడంతో పాటు వంగలపూడి అనిత మరియు మందక్రిష్ణను కులంపేరుతో దూషించినందుకు కేసు నమోదు చేయాలని పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో దీంతో శనివారం పోలీసులు 196, 308 (5), 351(3), 353 (సి), 112(2)(బి) ఆర్/డబ్ల్యు3 (5) బీఎన్ఎస్ సెక్షన్ 3 (1ఆర్) ఎస్ ఆర్, ఎస్సీ ఎస్టీ యాక్ట్ 2015, 67ఆఫ్ ఐటీ యాక్ట్ మేరకు కేసు నమోదు నమోదుచేశామని పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు.

కడప ఎమ్మెల్యేపై అసభ్య పోస్టులు..

కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఈ నెల 7న కడప కార్పొరేషన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆర్.మాధవి కడప కమిషనర్‌ను కాసేపు ఉండాలంటూ చెప్పే వీడియోను మార్ఫింగ్ చేసి కమిషనర్‌కు కన్ను కొట్టినట్లుగా క్రియేట్ చేశారు. దీనిని వైఎస్ జె ద వార్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగుకు వెలుగునిచ్చిన సీపీ బ్రౌన్



బ్రౌన్ విగ్రహం వద్ద వైవీయూ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య కృష్ణారెడ్డి

● వైవీయూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి

కడప కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిణుకు మిణుకుమంటున్న దశలో తెలుగు దీపానికి శాశ్వత వెలుగునిచ్చిన మహనీయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైవీయూ ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ 226వ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ముందుగా రాజీవ్ మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి, సమావేశ మందిరంలోని బ్రౌన్ చిత్రపటానికి అతిథులతో కలిసి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీ బ్రౌన్ సుమారు 15 మంది పండితులను పోషించి కడప గడపలో సాహిత్య యజ్ఞాన్ని నిర్వహించారన్నారు. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, స్థలదాత సీకే సంపత్‌కుమార్ లాంటి ప్రముఖులతో కలిసి బ్రౌన్ నివసించిన బంగళా శిథిలాలపైనే సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయాన్ని నిర్మించడం కడపకే కాదు గర్వకారణమన్నారు. వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఊపిరి కోల్పోతున్న తెలుగు భాషకు ప్రాణం పోయడానికి సీపీ బ్రౌన్ వచ్చారన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సంజీవమ్మ మాట్లాడుతూ ఆంగ్లేయుడైన బ్రౌన్ తన మాతృభాష కానటువంటి తెలుగుపై పట్టు సాధించి నిఘంటువుల నిర్మాణం చేస్తే.. తెలుగు వారైన మనం మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ ఆంగ్లంపై మక్కువ పెంచుకోవడం పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్, ప్రతాపరెడ్డి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి తదితరులు ప్రసంగించారు. మధ్యాహ్నం సీపీబ్రౌన్ పరిశోధన కేంద్రంలో ప్రముఖ అవధాని శారదాప్రసన్న అధ్యక్షతన తిరుపతికి చెందిన శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ చేసిన అష్టావధానం సాహితీ ప్రియులను అలరించింది. కార్యక్రమంలో వైవీయూ తెలుగు అధ్యాపకులు ఆచార్య రమాదేవి, డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ జయంత్ కశ్యప, బ్రౌన్ కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పరిగెత్తాలి

● యువతకు పిలుపునిచ్చిన జేసీ అదితిసింగ్
● అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ అదితిసింగ్

కడప స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరుగెత్తాలని జేసీ అదితి సింగ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు సంబంధిత రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్ అధ్యక్షతన ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ అదితిసింగ్ హాజరై మొదటి దశ పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీకి హాజరైన అభ్యర్థులను ఉద్దేశించి జేసీ మాట్లాడారు. అగ్నివీర్ ఆర్మీలో జాయిన్ అయ్యేందుకు జరిగే ఎంపికలకు ఇప్పటికే రాత పరీక్ష పూర్తయిందన్నారు. అందులో ఉత్తీర్ణత సాధించి.. ఫిజికల్ టెస్టుకు హాజరై కడపకు వచ్చిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలిపారు. ర్యాలీలో పాల్గొనే ప్రతిఒక్కరూ విజయకాంక్షతో ముందడుగు వేయాలన్నారు. ఆర్మీ అధికారుల పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించే ఈ ఎంపికలో అభ్యర్థులు విజయం సాధించి దేశానికి భద్రతనిచ్చే గొప్ప యువశక్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు ఎవ్వరూ దళారులను నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో ఇర్విన్, కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాకేశ్‌చంద్, అనుబంధ సంఘాల అధికారులు పాల్గొన్నారు.

కాగా.. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000 మంది అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరు కానున్నారు. వీరిలో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులకు ఐదురోజులపాటు ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అభ్యర్థులు ఎవరు ఏరోజు రావాలనే విషయమై ముందస్తుగా వారికి ఆర్మీ అధికారులు కాల్ లెటర్స్ పంపించారు.









ఆర్మీలో ఎంపిక కోసం పరుగుపందెంలో పాల్గొన్న అభ్యర్థులు



వివరాలను నమోదు చేసుకుంటున్న అభ్యర్థులు

ఫ్రీహోల్డ్.. భూదందా





జగన్ ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ పేరిట విలువైన భూములను వైసీపీ నేతలకు అధికారికంగా సంతర్పణ చేశారు. ఇవన్నీ ఇప్పుడు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో 76,275.24 ఎకరాలు ఫ్రీహోల్డ్ పరిధిలో చేర్చారు. ఇందులో 9,004.12 ఎకరాలు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నట్టు గుర్తించారు. ఇవన్నీ వైసీపీ నేతల ముఖ్యఅనుచరుల చేతుల్లోకి వెళ్లిపోయాయని అంటున్నారు. ఇక జగన్ సొంత జిల్లా కావడంతో అప్పటి అధికారులు కూడా వైసీపీ నేతలు ఆడించే ఆట పాడించే పాటగా పనిచేశారు. ఫ్రీహోల్డ్ భూములపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో వైసీపీ నేతల మాయాజాలం ఇప్పుడు బయటికి వస్తోంది.

● విలువైన భూముల స్వాహాకు..
● నాడు వైసీపీ నేతల పక్కా స్కెచ్
● నిబంధనలకు నీళ్లు
● విచారణలో వైసీపీ నేతల భూబాగోతం బట్టబయలు
● నిబంధనలకు విరుద్ధంగా 9వేల ఎకరాలు ఫ్రీహోల్డ్‌లోకి

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలన జనాలకు పీడకల లాంటిది. అప్పట్లో కొందరు వైసీపీ నేతలు తోడేళ్ల, భూరాబందులుగా మారి ఇసుకను కొల్లగొట్టారు.. ప్రభుత్వ భూములను లాగేసుకున్నారు. వాగు, వంక మాత్రమే కాదు.. చివరికి ప్రైవేటు భూములకు సంబంధించి కూడా బెదిరించి సొమ్ము చేసుకున్నారు. సెటిల్‌మెంట్లలో తేడా రావడంతో వైసీపీ గ్యాంగే సొంత పార్టీ నేత శ్రీనివాసరెడ్డిని పట్టపగలు నట్టనడిరోడ్డులో కత్తులతో హతమార్చారు. ఇక ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండగా మరింత అక్రమాలకు తెర లేపారు. సమయం లేదు మిత్రమా.. అన్నట్లుగా రెవెన్యూ అధికారులపై వత్తిడి తెచ్చి అడ్డదారులు తొక్కారు. వైసీపీ నేతలు అక్రమంగా కొట్టేసిన భూములను ఫ్రీహోల్డ్ పేరిట సక్రమం చేసేసుకున్నారు.

వైసీపీ నేతలకు లబ్ధి

రివర్స్ పాలనతో ప్రజలకు నరకం చూపిన జగన్.. గత ఎన్నికల్లో లబ్ధికోసం నిషిద్ధ జాబితా నుంచి అసైన్డ్ భూములను తొలగిస్తామని ప్రకటించారు. దీనివల్ల రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అంటే క్రయవిక్రయాలు జరుపుకోవచ్చన్నమాట. అప్పటికే చాలాచోట్ల అసైన్డ్ భూములను వైసీపీ నేతలు బలవంతంగా లాక్కున్నారు. వాటన్నింటినీ ఫ్రీహోల్డ్ పేరిట కొట్టేసేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా 20 ఏళ్లు పూర్తి చేసుకున్న అసైన్డ్ భూములను జగన్ సర్కారు 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2023 జూన్ 30 నాటికి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి ఫ్రీహోల్డ్ కిందకు తీసుకు వచ్చింది. అంటే 2003 మునుపు అసైన్‌మెంటు కింద తీసుకున్న వారి భూములన్నీ ఫ్రీహోల్డ్‌లోకి వస్తాయి. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో పట్టాదారుడు లేదా వారసుడి పేరుండాలి. అవి సాగులో ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో ఉంటే ఆ భూములను ఫ్రీహోల్డ్ పరిధిలోకి తీసుకోవాల్సి ఉంది. అయితే ఎన్నికల ముంగిట ఫ్రీహోల్డ్ పేరిట భారీ ఎత్తున వైసీపీ నేతలే విలువైన భూములు కొట్టేశారు.

రూల్స్ తుంగలో తొక్కి..

జిల్లాలో 7,6275.24 ఎకరాలను ఫ్రీహోల్డ్‌కి తీసుకువచ్చారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజనులో అసైన్డ్‌భూములు, చుక్కలు, ఇనాంలు కలుపుకుని 25,907.62 ఎకరాలు, పులివెందులలో 23,724.27, బద్వేలులో 15,88.17, కడపలో 10,755.18 ఎకరాలు.. మొత్తం 76275.24 ఎకరాలు ఫ్రీహోల్డ్‌లోకి వచ్చాయి. వీటన్నింటికీ 2023 జూన్ 30 నాటికి పట్టా తీసుకుని 20 ఏళ్లు అయి ఉండాలి. ఎవరి పేరుతో గతంలో పట్టా ఇచ్చారో వారి పేరే ఉండాలి. లేదంటే వారి వారసుల పేరు ఉండాలి. ఆన్‌లైన్‌లో, రికార్డుల్లో వారే ఉండాలి, ఆ భూములను మాత్రమే ఫ్రీహోల్డ్ కిందకు తేవాల్సి ఉంది. అయితే వైసీపీ నేతల ప్రభావంతో రూల్స్ మారిపోయాయి. 20 ఏళ్లు పూర్తి కాని విలువైన భూములను ఫ్రీహోల్డ్‌లోకి తీసుకువచ్చారు. ఆన్‌లైన్‌లో పేరు ఒకటి ఉంది, సాగులో మరొకరు ఉన్నారు. అగ్రిమెంట్లు చేసుకున్న విలువైన భూములు కూడా వచ్చాయి. అదెలా అంటే ప్రభుత్వ భూములు వాగులు వంకలు కూడా ఫ్రీహోల్డ్‌లోకి తీసుకువచ్చారు. అప్పట్లోనే దీనిపై దుమారం రేగింది. కూటమి ప్రభుత్వం తాజాగా విచారణ చేపట్టడంతో వైసీపీ నేతల బండారం బట్టబయలవుతోంది.

పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం..



ఫ్రీహోల్డ్ భూములపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నాం. మైదుకూరు మండలాన్ని ప్రయోగాత్మకంగా తీసుకున్నాం. అక్కడ ఫ్రీహోల్డ్‌లో అక్రమాలు జరిగినట్లు గుర్తించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా చేస్తున్నాం. ఈ నెల 15లోపు ఎంక్వయిరీ పూర్తవుతుంది. నిబంధనలు ఉల్లంఘించినట్టు తేలితే చర్యలు తీసుకుంటాం.

- అదితిసింగ్, జాయింట్ కలెక్టర్

విలువైన భూములు కొట్టేశారు

ఫ్రీహోల్డ్ భూముల్లో జరిగిన గోల్‌మాల్ గుట్టు రట్టుచేసేందుకు కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు మైదుకూరు మండలాన్ని ఎంపిక చేసుకున్నారు. ఇక్కడ 2,666 ఎకరాలు ఫ్రీహోల్డ్ పరిధిలోకి వచ్చాయి. అయితే ఇక్కడ ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించగా ఫ్రీహోల్డ్‌లో ఉన్న లొసుగుల గుట్టు బయటికి వచ్చింది. మైదుకూరు మండలంలో ముంబై-క్రిష్ణపట్నం ప్రధాన రహదారి కూడా వెళుతుంది. అలాగే కడప-కర్నూలు, హైదరాబాదు రహదారి.. కొత్తగా బెంగళూరు-అమరావతి రోడ్డు ఇక్కడ నుంచే పోతున్నాయి. దీతో భూములకు మంచి డిమాండ్ ఉంది. ఎకరా తక్కువ అనుకున్నా అంటే రూ.20లక్షలకు పైమాటే. తెలుగుగంగ కాల్వల భూములు, జాతీయ రహదారి పక్కన ఉన్న భూములు, బద్వేలు రోడ్డులో పరిశ్రమల శాఖ ఇచ్చిన భూములు కూడా ఫ్రీహోల్డ్ చేశారు. అంటే ఈ భూములను వైసీపీ నేతలు కొనడంతో ముందస్తు చర్యలు తీసుకున్నారు. వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అంటే అగ్రిమెంటు కొనుగోలులో ఉన్న విలువైన భూములను ఫ్రీహోల్డ్ పేరుతో రిజిస్ట్రేషన్‌కు ఓకే చేశారు. ఇక్కడ అక్రమాలు జరిగినట్టు విచారణలో తేలడంతో తహశీల్దారుతో పాటు పది రెవెన్యూ సిబ్బందికి అధికారులు నోటీసులు ఇచ్చారు.

కదులుతున్న డొంక

భూములు కొట్టేయడంలో వైసీపీ బ్యాచ్‌కు ఉన్న టాలెంట్ మరెవరికీ లేదంటారు. కలసపాడు, వీఎన్‌పల్లె, చక్రాయపేట, కడప, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం మరికొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిన భూములు ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చినవి 9,004.12 ఎకరాలు. ఇవన్నీ జగన్ ప్రభుత్వ నిబంధనల మేరకు వైసీపీ నేతలకు కట్టబెట్టారు. వీటిల్లో 300 ఎకరాలకు పైగా భూములు రిజిస్ట్రేషన్లు జరిగాయి. అయితే ఫ్రీహోల్డ్ భూములపై ప్రభుత్వం సీరియస్ కావడంతో పాటు రిజిస్ట్రేషన్లను రద్దు చేసింది. ఇప్పుడు విచారణ జరుగుతోంది. విచారణ పూర్తయితే మరెన్ని వేల ఎకరాల వైసీపీ భూరాబందుల చేతుల్లోంచి బయటకు వస్తాయో తెలుస్తుంది.

డివిజన్ల వారీగా..

● జమ్మలమడుగు రెవెన్యూ డివిజనులో రెవెన్యూ రికార్డులు, ఆన్‌లైన్ పొజిషన్, సాగులో వేరేవారు ఉన్న భూములను 1775.95 ఎకరాలను ఫ్రీహోల్డ్‌లో చేర్చారు. ఇది నిబంధనలకు విరుద్ధం. వీటిలో అసైన్డ్ భూములు 165.70 ఎకరాలు ఉంటే చుక్కల భూములు 1610.25 ఎకరాలు ఉన్నాయి.

● బద్వేలు రెవెన్యూ డివిజనులో అసైన్డ్ భూములఉ 1468.41 ఎకరాలు, చుక్కల భూములు 20.23, ఇనాంభూములు 647.1.. మొత్తం 2135.74 ఎకరాలు గుర్తించారు.

● కడప రెవెన్యూ డివిజనులో అసైన్డ్ భూములు 407.99 ఎకరాలు, చుక్కల భూములు 2030.63.. మొత్తం 2438.62 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్‌లో చేర్చారు.

మంచుకొండల పంట.. మదనపల్లె ఇంట..



● అగ్రికల్చర్ విద్యార్థి శ్రీనిధి వినూత్న ఆలోచన
● మూడేళ్లుగా కుంకుమ పువ్వు పంట సాగు

చల్లటి ప్రదేశాల్లో సాగయ్యే కుంకుమపువ్వు పంట మదనపల్లెలో సాగవుతోంది. అగ్రికల్చర్ విద్యార్థి శ్రీనిధి వినూత్నంగా ఆలోచించి తన ఇంటిలోనే ఈ పంటను సాగు చేస్తోంది. మూడేళ్ల నుంచి ఈ పంటను సాగు చేస్తూ సాంకేతికతను అందిపుచ్చు కుంటూ సత్ఫలితాలను సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. 6



మంచుకొండల పంట.. మదనపల్లె ఇంట..

సాధారణంగా కుంకుమ పువ్వు అనగానే ప్రతి ఒక్కరికీ కశ్మీర్ గుర్తొస్తుంది. ఇంచుమించు అలాంటి వాతావరణమే ఉన్న మదనపల్లెలో ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచనే ఓ అగ్రికల్చర్ విద్యార్థినికి వచ్చింది. ఇక వెనక్కు తిరిగి చూడకుండా వినూత్న సాగుకు సిద్ధమైంది. పంటను కంటికి రెప్పలా చూసుకుంటూ మూడేళ్లుగా మంచి ఫలితాలను సాధిస్తోంది. తెలుగురాష్ట్రాల్లో చాలా అరుదుగా సాగయ్యే పంట మదనపల్లెలో అందుబాటులో ఉండడంతో పట్టణవాసులే కాకుండా జిల్లా వాసులు ఆ విద్యార్థినిని శభాష్ అని అభినందిస్తున్నారు.

- అగ్రికల్చర్ విద్యార్థిని శ్రీనిధి వినూత్న ఆలోచన
- మూడేళ్లుగా మంచి ఫలితాలు
- శభాష్ అంటున్న జిల్లావాసులు

మదనపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంచుకొండల మధ్య చల్లటి ప్రదేశాలైన జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో మాత్రమే సాగయ్యే కుంకుమపువ్వు పంట ప్రస్తుతం మదనపల్లెలో సాగవుతోంది. పట్టణ శివారు ప్రాంతం చిప్పిలికి చెందిన పువ్వు శ్రీకాంత్‌రెడ్డి, పువ్వు భార్గవి దంపతుల కుమార్తె పి.శ్రీనిధి ఈ పంట సాగు చేస్తున్నారు. ఒకటి కాదు..రెండు కాదు..వరుసగా మూడేళ్ల పట్టువదలని విక్రమార్కునిలా పంట సాగు చేయడమే కాదు.. ఏటికేడు సాగులో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికతను అంది పుచ్చుకుంటూ ముందుకెళ్తున్నారు. అందరిలాగా ఫలితాల కోసం పాకులాడకుండా, లాభం కోసం ఎదురుచూడకుండా, పంట సాగునకు అనుకూలమైన ఇక్కడి వాతావరణంలో సాగు మరింత విస్తరించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒకటి రెండు చోట్ల అక్కడక్కడా సాగయ్యే కుంకుమ పువ్వు సాగును పదిమంది రైతులకు పరిచయం చేయడానికి పరితపిస్తున్నారు. ఇందుకోసం కుంకుమ పువ్వు కంటే విత్తనం ఉత్పత్తికే ప్రాధాన్యం ఇస్తున్నారు. కేవలం మూడు నెలల వ్యవధితో చేతికొచ్చే ఈ పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది.



ట్రేలో సాగుచేస్తున్న కుంకుమ పంట



కుంకుమ రేఖలు



వేరు చేసిన కుంకుమ రేణువులు

విద్యాభ్యాసం

బెంగళూరు యూనివర్సిటీలో సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేటర్ (అగ్రికల్చర్) బీఎస్సీ పూర్తి చేసిన శ్రీనిధి ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసి తర్వాత ఎస్వీ యూనివర్సిటీలో అదే విభాగంలో ఏడాది పాటు ఉద్యోగం చేశారు. తర్వాత అగ్రికల్చర్‌లో పీహెచ్‌డీ చేయాలని మొదట అనుకున్నా జీవితంలో ఏదో ఒకటి సాధించాలని సంకల్పించారు. తాను ఎంచుకునే ప్రాజెక్టును రొటీన్‌కు భిన్నంగా ఉండాలని ప్రత్యేకంగా ఆలోచించారు.

సాగు విధానం

240 చ.అ.విస్తీర్ణం గల గదిలో 340 ట్రేలు ఏర్పాటు చేయగా, ఒక్కో ట్రేలో విత్తన పరిమాణాన్ని బట్టి 100 నుంచి 130 విత్తనాలు అమరుస్తున్నారు. 2022 నుంచి 2024 వరకూ క్రమంగా 150 గ్రాములు, 200 గ్రాములు, 400 గ్రాముల కుంకుమ పువ్వును ఉత్పత్తి చేశారు. రోజువారీ కోసిన పుష్పాల నుంచి రేఖలు, స్టిగ్మాను వేరు చేసి కుంకుమ పువ్వును పక్కకు తీసి ఆరబెడతారు. సాగు చేసిన ప్రతీ విత్తనం ఫెయిల్ కాకుండా పువ్వు పూస్తే పంట దిగుబడి పెరుగుతుంది. అలాగే విత్తనం పరిపుష్టిగా ఉంటే రెండు పువ్వులు కూడా పూస్తుంటాయి. కుంకుమ పువ్వు మార్కెట్‌లో గ్రాము ధర రూ.500 నుంచి రూ.700 పలుకుతోంది. మిగిలిన పసుపు స్టిగ్స్, రేఖలను ఇతర అవసరాలైన స్వీట్స్, కాస్మెటిక్‌లలో ఉపయోగిస్తారు. ఇటీవల వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల నేపథ్యంలో జమ్మూ-కశ్మీర్‌లోనూ ఇండోర్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు. విత్తనాన్ని మరింత ఉత్పత్తి చేసే క్రమంలో కృత్రిమ వాతావరణంలో కాకుండా సాధారణ వాతావరణంలో మంచి పోషకాలు ఇచ్చి విత్తనం పరిమాణం పెద్దదిగా ఉండేలా పరిశోధనలు చేస్తున్నారు.



వికసించిన పుష్పం

స్నేహితుడు.. తల్లిదండ్రుల సహకారం

తనతో పాటు బెంగళూరు యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చేసిన తన స్నేహితుడు శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనిధి తల్లిదండ్రుల సహకారంతో మూడేళ్లుగా నిరాటంకంగా పంట సాగు చేస్తున్నారు. మొదటగా 2022 ఆగస్టులో విత్తనాన్ని జమ్మూ-కశ్మీర్ నుంచి తెప్పించారు. పంట సాగుకోసం మొదట రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. పంటసాగులో జమ్ము-కశ్మీర్, హర్యానా యూనివర్సిటీ ప్రొఫెసర్ల నుంచి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు తీసుకుంటూ మొదలు పెట్టగా, ప్రస్తుతం శ్రీనిధి అన్నీ తానే స్వయంగా చూసుకుంటున్నారు. ఏటా ఆగస్టులో నాటే ఈ పంట కేవలం మూడు నెలల వ్యవధిలోనే అంటే నవంబరులో పూర్తవుతుంది. అంచెలంచెలుగా వికసించే పుష్పాలను ఎప్పటికప్పుడు కోస్తూ, రేఖలు, అందులోని పుష్పరేణువులను వేరు చేస్తారు. ఇందులో రేణువుల నుంచి కుంకుమ పువ్వు తీస్తుండగా, రేఖలను కూడా ఇతర అవసరాలకు మార్కెట్ చేస్తున్నారు.

ప్రత్యేకగది.. కోల్డ్ స్టోరేజ్

జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో ఉష్ణోగ్రతలు పది డిగ్రీల సెల్సియస్ నుంచి 23 డిగ్రీల సెల్సియస్‌లో ఉంటాయి. అలాంటి వాతావరణంలో మాత్రమే కుంకుమ పువ్వు సాగవుతుంది. ఇలాంటి వాతావరణాన్నే ఇక్కడ పంట సాగునకు కల్పిస్తున్నారు. ఈ క్రమంలో తన నివాసంలోని ప్రత్యేక గదిలో చిల్లింగ్ కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన ఆ గదిలో వాతావరణాన్ని ఎప్పటికప్పుడు పరికరాలతో పరిశీలిస్తూ, ఉష్ణోగ్రతలో ఏమాత్రం తేడా లేకుండా చూస్తున్నారు. హైజినిక్ కండీషన్‌లో పాలీయూరేటెడ్ ఫైబర్, థర్మాకోల్ ఇన్సులేషన్‌తో ఇండోర్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. గాలిలో తేమ ఆధారంగా ఆర్గానిక్ పద్ధతిని అవలంబిస్తున్నారు. విత్తనం ఏడు గ్రాములుంటే ఒక పువ్వు, పది గ్రాములు ఆపై ఉంటే రెండు పూలు పంట దిగుబడి వస్తున్నట్లు నిర్వాహకురాలు చెబుతున్నారు.

ఇక్కడెందుకు సాగు చేయకూడదు

- పి.శ్రీనిధి, నిర్వాహకురాలు, మదనపల్లె



కశ్మీర్‌లోనే పండించే పంట ఇక్కడ ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచన నాకు వచ్చింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ల సలహాలు, సూచనలు తీసుకుంటూ మూడేళ్లుగా సాగు చేస్తున్నా. ప్రతి ఏడాది వచ్చే ఇబ్బందులు, సమస్యలను అధిగమిస్తూ, పంట సాగులో మెలకువలు పాటిస్తూ పురోగతి సాధిస్తున్నా. ఇతర రాష్ట్రాల్లోనూ అతి తక్కువగా సాగవుతున్న పంట ఇది. ఇందులో లాభం కంటే వాటి విత్తనాలు ఉత్పత్తి చేయాలన్నదే నా ప్రధాన ఉద్దేశ్యం.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని కాపాడిన సీఐ

బి.కొత్తకోట, నవంబరు 10: క్షణికావేశంలో తనువు చాలించబోయిన యువకుడి ప్రాణాలు బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి కాపాడారు. పోలీసుల కథనం మేరకు... గొల్లపల్లె పంచాయతీ గుడిసివారిపల్లె వాసి జీవన్‌రెడ్డి చదువు పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉంటున్నాడు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన ఓ కంపెనీ ఉద్యోగి కడప వాసి రంజిత్‌రాయల్ మాటలు నమ్మి రూ.2లక్షలు డబ్బు చెల్లించాడు. అయితే అతను నమ్మించి మోసం చేశాడని గ్రహించి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం బాగా పొద్దుపోయాక తన తల్లికి ఫోన్ చేసి తాను మోసపోయానని, ఇక జీవించాలను కోలేదని, ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. దీంతో తల్లి తనకు అందుబాటులో ఉన్న బంధువులందరికీ చెప్పినా ఫలితం లేకపోయింది. చివరికి సీఐ రాజారెడ్డికి సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన సీఐ లోకేషన్‌ను కనిపెట్టాడు. వెంటనే సిబ్బందితో పాటు వెళ్లి జీవన్‌రెడ్డిని పట్టుకున్నారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు. తప్పులు చేయడమే కాకుండా కుటుంబీకులను బాధితులను చేయడం, పైగా ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదన్నారు. కాగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వచ్చి తన బిడ్డ ప్రాణాలు కాపాడినందుకు సీఐకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను సత్కరించారు.



సీఐ రాజారెడ్డిని సత్కరిస్తున్న జీవన్‌రెడ్డి కుటుంబ సభ్యులు



కోన సమీపంలోని లోయ దృశ్యం

కమనీయం.. అగస్త్యేశ్వర క్షేత్రం

- భక్తులకు కొంగు బంగారం
- కొండకోనల నడుమ వెలసిన శైవక్షేత్రం
- మహర్షుల పాద ధూళితో పునీతం

మైలవరం, నవంబరు 10: సుందరమైన కొండ కోనలు, వాగు వంకలు, పచ్చిక బయళ్లు ప్రకృతి సిద్ధమైన గుహలు ఇలా కమనీయ, రమణీయ దృశ్యాలతో అగస్త్యేశ్వర క్షేత్రం అలరారుతోంది. కాగా సకల వ్యాధి నివారణ క్షేత్రంగా శ్రీ అగస్త్య మహాముని కఠోర దీక్ష తపో భూమి అయిన ఈ క్షేత్రం భక్తుల పెన్నిధిగా ఉంటోంది. ముఖ్యంగా కార్తీక మాసం, శివరాత్రి సమయాల్లో భక్తుల సందడితో ఈ క్షేత్రం కళకళలాడుతోంది. రాయలసీమలోని దండ కారణ్యంలో ఎందరో మహానుభావుల, మహర్షుల పాద ధూళితో పునీతమైన ఈ అగస్త్యేశ్వర క్షేత్రం అత్రిముని కోనగా కూడా విరాజిల్లుతోంది.

దివ్య కొలను.. ఔషధ జలం...

అనేక రాజ్యాల రాజకీయ చతురతను, వీర విహారాన్ని గుర్తుకు తెస్తూ సాక్షి భూతంగా నిలిచిన గండికోటకు అతి సమీపంలో లోయ, అవతలి వైపు కొండలో వెలసిన అగస్త్యేశ్వర క్షేత్రంలో స్వయం సిద్ధంగా పుట్టిన పిల్ల కాలువలతో, వన మూలికలతో దివ్య ఔషధమైన జలాన్ని నింపుకున్న కొలను ఇక్కడ ఉంది. ఈ కొలనులో అగస్త్య మహాముని ప్రతి రోజు స్నానం ఆచరించి జప తపాలు చేసినట్లు స్థల పురాణం వల్ల తెలుస్తోంది. ఎందరో అనారోగ్య పీడితులు ఈ కొలనులో స్నానం ఆచరించి స్వస్థత పొందుతున్నట్లు ఈ ప్రాంత ప్రజలు చెప్పుకుంటున్నారు.

మాతృత్వాన్ని ప్రసాదించే ఆదిశేషుడు

దుర్గా సుబ్రమణ్యేశ్వర వర ప్రసాదంగా, అగస్త్య మహాముని తపో ఫలితంగా వెలసి కోరిన వరాలు ఇస్తూ సంతానం లేని వారికి మాతృత్వాన్ని కలిగిస్తున్న ఆదిశేషుని నివాసం (బ్రహ్మాండమైన పుట్ట) మహిళల కలలను సాకారం చేస్తున్నట్లు భక్తుల నమ్మకం. ఇక్కడ ఉన్న పుట్టకు 40 రోజుల పాటు ప్రదర్శనలు చేసి సంతానం లేనివారు ఎందరో మాతృ సౌభాగ్యం పొందుతున్నట్లు ప్రజల విశ్వాసం.

జమ్మలమడుగు నుంచి అగస్త్యేశ్వర కోనకు ఆర్టీసీ వారు బస్సుసౌకర్యం కల్పించడంతో రోజు రోజుకు సందర్శకుల రద్దీ పెరుగుతోంది. ఇక్కడ భక్తాదుల నివాసానికి వసతి, భోజన సదుపాయాలతో ఈ క్షేత్రం నిత్య నూతనంగా విరాజిల్లుతోంది. కార్తీక మాసం, దత్త జయంతి, నవరాత్రి ఉత్సవాలు, అలాగే ధనుర్మాసంలో విశేష పూజలు ఘనంగా జరుగుతాయి. ముఖ్యంగా ఈ క్షేత్రం కార్తీక మాసం, శివరాత్రి పర్వదినాల సందర్భంగా భక్తజన సందోహంతో కోలాహలంగా తిరుణాల వాతావరణంలో ఉంటుంది.



ఆలయ ఆవరణంలోని దివ్య కొలను



ఆలయంలోని శివలింగం

క్షేత్ర మహిమ

మండల కేంద్రానికి 8 కి.మీ. దూరంలో కొండల నడుమ ఈ అగస్త్యేశ్వర క్షేత్రం ఉంది. త్రేతా యుగంలో అగస్త్య మహాముని దేశ సంచారంలో భాగంగా దక్షిణదిశగా వెళ్తూ మార్గం మధ్యలో అనేక చోట్ల శివలింగాల ప్రతిష్ఠలు చేసి తపస్సు కొనసాగిస్తూ ముందుకు సాగారు. ఈ నేపథ్యంలో దండ కారణ్యమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి అగస్త్య కోనలో అడుగుపెట్టారు. ఇక్కడ మనో సిద్ధి కోసం ధర్మపత్ని లోపముద్రతో కూడి పరమేశ్వరానుగ్రహానికై దుర్గా సుబ్రమణ్యేశ్వర విగ్రహాలను ప్రతిష్ఠ గావించి ఘోర తపస్సు చేసినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.







శివపూజకోసం..

కార్తీకమాసం కావడంతో శివాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. కొండకోనల్లో కొలువైన శివుని దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివెళుతున్నారు. కార్తీక వనభోజనాలూ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో పూలకు డిమాండ్ ఏర్పడింది. దీనికి తగినట్టు జిల్లాలోని పెండ్లిమర్రి, పులివెందుల, ఖాజీపేట మండలాల్లో పూలతోటల్లో రైతులు బిజీగా ఉన్నారు. కూలీలను పెట్టి పూలను కోసి అమ్మకాలకు తరలిస్తున్నారు. రోడ్డుపక్కన కళకళలాడుతున్న సువాసనల విరులు ఆ మార్గంలో వెళ్లేవారికి కనువిందు చేస్తున్నాయి.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప







రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

- ఒకరి మృతి ● మరొకరికి తీవ్రగాయాలు ● ఇరువురికి స్వల్పగాయాలు

సిద్దవటం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చిరంజీవి వివరాల మేరకు.. మండలంలోని వడ్డిపల్లె గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు రెండు ద్విచక్ర వాహనాల్లో ఇద్దరు చొప్పున ఆదివారం కడపకు వెళుతున్నారు. కడప - చెన్నై రహదారిలోని భాకరాపేట మల్లిలేనిపట్నం మలుపు వద్దకు రాగానే కడప వైపు నుంచి రాజంపేటకు వేగంగా వెళుతున్న కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముందు ఢీకొన్న బైకులో కిరణ్‌కుమార్(17), శేషాద్రి(18)లకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక వస్తున్న మరో బైకులో ఉన్న వర్ధన్, బాలు అనే ఇరువురికి స్వల్పగాయాలయ్యాయని తెలిపారు. నలుగురిని వైద్య చికిత్సల నిమిత్తం 108లో కడప రిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ కిరణ్‌కుమార్ మృతిచెందినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ శేషాద్రిని మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతికి తరలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కిరణ్ (ఫైల్ ఫొటో)

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు




ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన జిల్లా కార్యవర్గంతో ఆస్కార్‌రావు

కడప మారుతీనగర్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలకులు మారుతు న్నా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాలకుల తీరు కారణంగా రోజురోజుకూ ఉద్యోగులపై భారం ఎక్కువ అవుతోందన్నారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల ముఖ ఆధారిత విధానాన్ని అటెండెన్స్‌తో పాటు వాటి ఆధారంగా జీతభత్యాల నిర్ణయం, కోతలు విధించారన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఏఎన్‌ఎంలపై ఇటు ఆరోగ్యశాఖతో పాటు గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల పెత్తనం ఎక్కువ కావడం సరైందికాదన్నారు. ముఖ్యంగా వైద్య ఉద్యోగులకు పదోన్నతులు కల్పించకపోగా పీఆర్‌సీలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తదనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా టి.విన్సెంట్‌కుమార్, కార్యదర్శిగా రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్ వరప్రసాద్, శివ, సంయుక్త కార్యదర్శులుగా విజయలక్ష్మి, లక్ష్మీదేవి, నాగేశ్వరి, రామసుబ్బారెడ్డి, ఏసుపాదం, సుధాకర్, అన్నపూర్ణ, నియమితులయ్యారు.

బడికి దూరంగా...

● చదువుకు దూరమవుతున్న లక్షలాది మంది పిల్లలు
● జిల్లాలో బడిబయట పిల్లల సంఖ్య 15807 మంది
● చర్యలకు ఉపక్రమించిన కూటమి ప్రభుత్వం
● అర్హత ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించడమే లక్ష్యం



కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు పాఠశాల విద్యకు ఖర్చు చేస్తున్నా వాటి ఫలితాలు పూర్తిస్థాయిలో కనిపించడంలేదు. ప్రభుత్వ పాఠశాలలో చదువులకు దూరమవుతున్న పిల్లల పట్ల కనీస చర్యలు చేపట్టకపోవడం.. పాఠశాలల్లో లేని పిల్లలను కూడా ఉన్నట్లు గతంలో చూపించడం.. తదితర కారణాలతో ప్రస్తుతం లక్షలాది మంది పిల్లలు రాష్ట్రంలో చదువులకు దూరమయ్యారు. ఇందులో కడప జిల్లా 16వ స్థానంలో ఉంది. దీంతో జరిగిన పొరపాటును సరిదిద్దుకునేందుకు బడిబయట పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాలంటూ పాఠశాల విద్యాశాఖ జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి కూటమి ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకుంది. బడిబయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించడమే లక్ష్యంగా వందశాతం నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే..

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వరకు 3,58,218 మంది విద్యార్థులు బడిబయట ఉన్నారని.. పది ఉత్తీర్ణులైన తరువాత 1,55,427 మంది బడిబయట ఉన్నారని పాఠశాల విద్యశాఖ తేల్చిచెప్పింది. 1 నుంచి 10 వరకు ప్రస్తుతం బడి బయట ఉన్న పిల్లల సంఖ్య 2,02,791గా రాష్ట్ర విద్యాశాఖ తేల్చింది. ఇందులో కడప జిల్లాలో ఇంటర్మీడియట్ వరకు 15,807 మంది విద్యార్థులు బడికి పోవడం లేదని.. 10 ఉత్తీర్ణత అయిన తరువాత 9601 మంది బడి బయట ఉన్నారని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఇదే విధంగా 1 నుంచి 10 వరకు 6201 బడిబయట ఉన్న పిల్లల సంఖ్యగా రాష్ట్రవిద్యాశాఖ తాజా లెక్కల ద్వారా తేల్చి చెప్పింది. గతంలో కొన్ని మండలాల్లో అసలు బడి బయట పిల్లలు లేరని ప్రకటించుకోవడం జరిగింది. పూర్వవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ బడిబయట పిల్లలు లేని సమాజాన్ని నిర్మిస్తామని లేదంటే రాజీనామా చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రవిద్యాశాఖ జిల్లాలోని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇస్తూ బడిబయట పిల్లలు ఎవరు లేకుండా చేసేందుకు వంద శాతం నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచనలు చేసింది. ఇందుకు సంబంధించి లక్ష్యాలు కూడా నిర్దేశించారు.

ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రకటించాలి



బడిబయట పిల్లలను పాఠశాల్లో చేర్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రకటించాలి. బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం వసతిగృహాలు, పునరావాస కేంద్రాలను బలోపేతం చేయాలి. సమస్య ఎక్కువగా ఉన్న చోట రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలి. బాల కార్మికులను పనిచేయించుకుంటున్న చిన్న చిన్న వ్యాపార కేంద్రాలు, వివిధ రంగాలపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే సౌకర్యాలను వర్తింపజేస్తున్నట్లు చట్టం తీసుకురావాలి. వంద శాతం నమోదు చేయాలే తప్ప కాకి లెక్కలకు స్వస్తి పలకాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

లక్ష్యాలు ఇవే..

● బడబయట ఉండి చదువుకునేందుకు అర్హత ఉన్న పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించడానికి వంద శాతం నమోదు చేయాలి.

● 6 నుంచి 14 సంవత్సరాల వయసు గల పిల్లలు పాఠశాలకు దూరంగా ఉండకుండా చూడాలి.

● డ్రాపవుట్స్ పిల్లలను తిరిగి పాఠశాలలకు తీసుకురావడం, సమగ్ర శిక్ష జిల్లా విద్యాశాఖాధికారులు, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్లు డ్రాపవుట్స్ పిల్లలను.. బడి బయట పిల్లలను రెగ్యులర్ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించేందుకు కేఎల్‌ఎస్‌టీవో, ఎంఈవో, సీఆర్పీల ద్వారా నమోదు చేయించాలి.

● సీఆర్పీలు, హెచ్‌ఎంలు, గ్రామ విద్యాసంక్షేమ సహాయకులు నిర్దేశించిన ప్రొఫార్మలో నమోదు లేఖను ప్రతి వారం తప్పనిసరిగా రాష్ట్ర ఎస్‌ఎస్ సమగ్రశిక్ష కార్యాలయానికి నివేదికలు పంపించాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో కూటమి ప్రభుత్వం వంద శాతం బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలో అధికారులు, సిబ్బంది దీనిపై ఎంత మేర లక్ష్యాలు సాధించగలరో చూడాల్సి ఉంది.

భారీ స్కోర్ల దిశగా అనంతపురం, గుంటూరు జట్లు

కడప స్పోర్ట్స్ నవంబర్,10 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-14 మెన్ రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం కడపలో వివిధ జట్ల మధ్య పోటీలు సాగాయి. కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం, క్రిష్ణా జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 322 పరుగులు చేసింది. ఇందులో ఆర్. ఆదినారాయణరెడ్డి 181 పరుగులు (124బంతుల్లో) సాధించడం విశేషం. అలాగే కేఎస్ఆర్ఎం మైదానంలో శ్రీకాకుళం-గుంటూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన గుంటూరు జట్టు 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 334 పరుగుల భారీ స్కోర్ సాధించిం ది. ఇందులో కౌశిక్ 92, రామ్‌చరణ్ 81, అభినవ్ డేవిడ్ 74 పరుగులు చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి



సికెదిన్నె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బుగ్గవంక డ్యాంలో పడి తాటిమాకుల అంకయ్య (54) మృతి చెందాడు. సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు... మండలంలోని ఇప్పెంట యానాది కాలనీకి చెందిన అంకయ్య బుగ్గవంక డ్యాంలో చేపలు పట్టేందుకు శనివారం సాయంత్రం వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీళ్లలో పడి మృతి చెందాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు డ్యాం వద్ద ఆదివారం పరిశీలించగా అంకయ్య శవం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈత కోసం నదిలోకి దిగి...



చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యలతో కలసి సరదాగా గడిపేందుకు వెళ్లి.. ఈత కోసం పెన్నానదిలోకి దిగిన ఓవ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. కడప నగరం తిలక్‌నగర్‌కు చెందిన బిల్లిపాటి బాబు (38) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం గండి వాటర్‌వర్క్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఒడ్డుపై భార్య, కొడుకును కూర్చోబెట్టి బావమరదులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు నదిలోకి దిగాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. బావమరదులు సమీపంలోని వ్యక్తులతో కలిసి వెతకగా.. రెండు గంటల తర్వాత మృతదేహం బయటపడింది. చెన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ..

చాపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో మొగిలి లక్ష్మీదేవి (25) విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. లక్ష్మీదేవి తన ఇంటిలో ఉన్న విద్యుత్తు మోటారును ఆన్‌చేసి నీటిని ఇంటిలో పట్టుకుంటుండగా వైరు డ్యామేజీ అయినచోట ఆమె కాళ్లకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురైంది. వెంటనే అత్త రామలక్షుమ్మ, బావ రామచంద్రయ్య లక్ష్మీదేవిని కాపాడేందుకు ప్రయత్నించగా వారికి కూడా కరెంటుషాక్ తగిలడంతో కేకలు వేశారు. దీంతో ఇంటిలోనే ఉన్న లక్ష్మీదేవి భర్త రామ్మోహన్ విద్యుత్తు బోర్డులో స్విచ్ ఆఫ్ చేశారు. అయితే అప్పటికే లక్ష్మీదేవి మృతి చెందగా.. ఆమె అత్త, బావలు ప్రమాదం నుంచి బయట పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రాష్ట్రస్థాయి హాకీ విజేతలు కడప, విశాఖ

● జాతీయ స్థాయికి రెండు జట్లు ఎంపిక ● వచ్చే నెల ఎనిమిది నుంచి మధ్యప్రదేశ్‌లో పోటీలు



జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

నక్కపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు మూడు రోజుల పాటు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఫైనల్ పోరులో బాలికల విభాగంలో కడప జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, బాలుర విభాగంలో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించగా, చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో ద్వితీయ స్థానం కడప, తృతీయ స్థానం చిత్తూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు, నక్కపల్లి బీఏస్ హాకీ క్లబ్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఇదిలావుంటే, రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయికి అర్హత సాధించారు. రాష్ట్రం తరపున జాతీయ పోటీల కోసం బాల, బాలికల విభాగంలో రెండు జట్లను ఎంపిక చేసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. వీరు డిసెంబరు ఎనిమిదో తేదీ నుంచి 13 వరకు మధ్యప్రదేశ్‌లోని మాంటిస్సోరి గ్రామంలో జరగనున్న జాతీయ పోటీల్లో తలపడనున్నారని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడా పోటీలు



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన కర్నూలు జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

● విజేతలుగా నిలిచిన కర్నూలు, నెల్లూరు జట్లు

కమలాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీకాలేజీ ఆవరణలో జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి బాలబాలికల అండర్ 14 రగ్బీ క్రీడా పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ క్రీడా పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 13 జట్లు పాల్గొనగా.. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో బాలికల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన కర్నూలు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. కడప జట్టుకు రెండో స్థానం దక్కింది. అదే విధంగా బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, రెండో స్థానంలో కర్నూలు జిల్లా జట్టు నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు స్కూలు గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని.. అప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీ తిరుపాల్‌రెడ్డి, సూర్య ట్రాన్స్‌పోర్టు అధినేత ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి ఉత్సవాలు



బ్రహ్మంగారి దేవస్థానం, కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి ఉత్సవాలను ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. పూర్వపు మఠాధిపతుల ఆదేశానుసారం కార్తీక శుద్ధ ద్వాదశి రోజు స్వామివారి జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 13న బుధవారం రాత్రి 7గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనదలచిన దంపతులు రూ.2116 చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కల్యాణ సమయంలో చదివింపులు చేసిన వారికి తలంబ్రాలు, అక్షింతలు అందిస్తారని ఆలయ మేనేజరు ఈశ్వరాచారి తెలిపారు.

వివాదాస్పదంగా మట్టి వ్యవహారం

● రాయల్టీ అధికారులకు ఫిర్యాదు

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలంలో మట్టి తోలుకునే వ్యవహారం వివాదస్పదంగా మారుతోంది. మట్టిని ఎక్కడపడితే అక్కడ తోలుకుంటున్నారు. ఇప్పటికే గుట్టలు గుల్ల అయిపోయాయి. ఇటీవల లీజును టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి తెచ్చుకున్నారు. రెండు రోజుల క్రితం మట్టితోలుకునేందుకు వెళ్లగా టీడీపీకి చెందిన మరోవర్గం వారు అభ్యంతరం తెలిపి పోలీసులకు ఫిర్యాదు చేయగా లీజు పత్రాలు ఉన్నాయని చూపడంతో సమస్య సర్దుమణిగింది. కాగా, పాములూరు రోడ్డులోని కొండల వద్ద మట్టి తోలేందుకు టీడీపీలోని ఒక వర్గం వెళ్లగా లీజు తీసుకున్న జయచంద్రారెడ్డి తదితరులు అడ్డుకొని రాయల్టీ అధికారులకు ఫిర్యాదు చేశా రు. పులివెందుల జోన్ రాయల్టీ అధికారి సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఎక్స్‌కవేటర్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. రూ.10వేలు జరిమానా వేసి పంపించామని వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ రంగారావులు తెలిపారు. కాగా ఇప్పటి వరకు ఎక్కడపడితే అక్కడ రాయల్టీలు లేకుండా మట్టిని తోలుకుంటుండగా సమస్య అధికారుల దృష్టికి వెళ్లడంతో రాయల్టీతో లీజు ఉన్న ప్రాంతంలోనే మట్టిని తోలాలని.. ఇతర ప్రాంతాలలో తరలిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. అయితే ఇది ఆచరణలో ఎంతమాత్రం జరుగుతుందో వేచి చూడాల్సిందే.



మట్టి తోలుతున్న ప్రాంతానికి వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి తదితరులు

ఆత్మకూరులో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్



క్రీడాజ్యోతిని వెలిగించి టోర్నమెంట్‌ను ప్రారంభించిస్తున్న రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆత్మకూరులో క్రీడా సంబరాలు అంబరాన్ని అంటాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో ఆదివారం 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలను జ్యోతిని వెలిగించి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 39 టీమ్‌లకు సంబంధించిన 546 మంది క్రీడాకారులు, 72 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ విద్యార్థులంతా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించి జాతీయస్థాయిలో రాష్ట్ర కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఆత్మకూరులో జరిగే నెట్‌బాల్ టోర్నమెంట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన టీమ్‌లకు, మన రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపికయ్యే బృందానికి జెర్సీలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బీ పావని, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గుంతలు.. బాబోయ్ గుంతలు



వేంపల్లె వైఎస్సార్ పార్క్ఎదురుగా రోడ్డుపై గుంతలు... ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డు మధ్యలో పెద్ద గుంత

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలోని ప్రధాన రోడ్లపై గుంతలు ఏర్పడి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల విస్తరణలో భాగంగా గత ప్రభుత్వం పనులు ప్రారంభించి నిలిపివేసింది. అప్పటి నుంచి ఈ రోడ్లను మెయింటెనెన్స్ చేయకుండా వదిలేశారు. వర్షానికి పలు చోట్ల గుంతలు పడ్డాయి. ప్రధానంగా వేంపల్లె పట్టణం కడప రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, వైఎస్సార్ పార్క్, పెట్రోల్ బంకు సమీపంలో రోడ్లపై భారీ గుంతలు పడ్డాయి. దీంతో ఇవి రోడ్లేనా అన్నట్లుగా దుస్థితి ఉంది. వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. రోడ్లు, భవనాల శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కనీసం గుతలను అయినా పూడ్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆశా వర్కర్లకు అప్పగించిన విధులు మాత్రమే చేయించాలి

పులివెందుల రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు అప్పగించిన విధులను మాత్రమే చేయించాలని సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రాజమణి, సీఐటీయూ పులివెందుల కార్యదర్శి గఫూర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆశావర్కర్ల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్సీలలో ఏఎన్ఎంలు చేయాల్సిన పనులు కూడా ఆశావర్కర్లచే చేయించడం మానుకోవాలన్నారు. పీహెచ్సీలను శుభ్రం చేయమని వారికి చెప్పడం దారుణమన్నారు. అనంతరం పులివెందుల ఆశావర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా లలిత, సునందలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పద్మావతి, వెంకటేశ్వరమ్మ, ఇందిర, ప్రమీల, శివనారాయణమ్మ, ప్రభావతి, సంజమ్మ, రాధ, అరుణ, చంద్రకళ, సురేఖ, భారతి, నాగరత్నమ్మ ఎన్నికయ్యారు.



కడప-రాయచోటి జాతీయ రహదారి మూలవంక వద్ద గల ఉద్యానవన శాఖ కార్యాలయ భవనాన్ని రూ. లక్షలు వెచ్చించి ఎంతో సౌకర్యవంతంగా నిర్మించారు. అయితే ఈ కార్యాలయాన్ని కలెక్టరేట్‌లోకి మార్చడంతో ప్రస్తుతం ఇది నిరుపయోగంగా ఉంది. అన్ని వసతులున్న ఈ భవనాన్ని ఏదో ఒక ప్రభుత్వ అవసరానికి ఉపయోగిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. -సీకేదిన్నె, (ఆంధ్రజ్యోతి)

విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరించుకుందాం

- వన్యప్రాణులు, అటవీ సంపదను సంరక్షించాల్సిన బాధ్యత అందరిది..
- జిల్లా అటవీ శాఖాధికారి వినీత్‌కుమార్

కడప క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన వారిని స్మరించుకుందాం అని, వన్యప్రాణులు, అటవీ సంపదను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అటవీ శాఖ జిల్లా అధికారి వినీత్‌కుమార్ అన్నారు. ఆదివారం కడప నగరం జిల్లా ఫారెస్టు అధికారి కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలన్నారు. కడప జిల్లా ఫారెస్టు రేంజర్ కార్యాలయంలో వినీత్‌కుమార్ ఆధ్వర్యం లో ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజనల్ అటవీ అధికారి రాజశేఖర్‌బాబు, సోషల్ ఫారెస్టు డివిజనల్ అటవీ అధికారి శివకుమార్, బద్వేలు సబ్ డివిజనల్ అటవీ అధికారి స్వామి వివేకానంద, కడప రేంజ్ అధికారి ప్రసాద్, మినిస్టీరియల్ సిబ్బంది కలిసి రాష్ట్ర అటవీ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా ఫారెస్టు అధికారి వినీత్‌కుమార్

ఉర్దూ విద్యాభివృద్ధికి కృషి: అమీర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న అమీర్‌బాబు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉర్దూ విద్యాసంస్థలు, భాషాభివృద్ధికి కృషి చేస్తామని పలువురు వక్తలు హామీ ఇచ్చారు. ఆదివారం కడప నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంజుమన్ తరక్కీ ఉర్దూ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఉర్దూ సెమినార్ ముగింపు సమావేశం ఛైర్మన్ సత్తార్‌ఫైజి, కన్వీనరు హిదయతుల్లా ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో చీఫ్ ప్యాట్రన్ అమీర్‌బాబు మాట్లాడుతూ ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఉర్దూ ఉపాధ్యాయుల ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఉర్దూ డీఎస్సీలో అభ్యర్థులు లేనిచోట ఆ పోస్టులను డీరిజర్వు చేయాలని డిమాండ్ చేశారు. ఉర్దూ ఇంటర్, డిగ్రీ కళాశాల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఏపీ అధికారిక లోగోలో ఉర్దూను చేర్చాలని, కొత్త జిల్లాల్లో ఉర్దూ డీఐ, ఉర్దూ ఏఎంఓ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలన్నారు. దీంతో పాటు మరిన్ని తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఛైర్మన్ సత్తార్‌ఫైజి మాట్లాడుతూ ఉర్దూ అకడమిక్ ఛైర్మన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఉర్దూ చదవడం, రా యడం తెలిసినవారై ఉండాలన్నారు. కన్వీనరు సయ్యద్ హిదయతుల్లా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మాదిరిగా ప్రతి జిల్లా కలెక్టరేట్, ఆర్డీఓ, మంత్రుల కార్యాలయాల్లో ఉర్దూ అధికారులను నియమించాలని, ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలను ప్రతి పాఠశాలకు సమయానికి చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, డాక్టర్ అలీఖాన్, దావుద్ మోహిత్, అహ్మద్‌షరీఫ్, ఖాజీ అబిద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



జీవన్ గంగానాథ్ బాబు, పులివెందుల అర్బన్ సీఐ

ముఖాముఖి

పులివెందుల టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పులివెందులలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ గంగానాథ్‌బాబు అన్నారు. పట్టణంలో ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. ఆదివారం సీఐ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: పులివెందులలో మట్కా, పేకాట రాయుళ్లు ఉన్నారా?

జవాబు: పట్టణంలో మట్కా లేదు. కానీ కొన్ని ప్రాంతాల్లో పేకాటరాయుళ్లు ఉన్నారు. వారిపై గ్రామాల్లో, పట్టణాల్లో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

ప్రశ్న: గ్రామాల్లో నైట్‌బీట్ ఏర్పాటు చేశారా.. లేదా?

జవాబు: మండల కేంద్రమైన పులివెందులతో పాటు కొన్ని గ్రామాల్లో నైట్‌బీట్ ఏర్పాటు చేశాం.రాత్రిపూట వీధుల్లో పోలీసులు తిరుగుతున్నారు.

ప్రశ్న: శాంతిభద్రతల పరిరక్షణకు ఎలా కృషి చేస్తున్నారు?

జవాబు: పట్టణంలో ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ముందస్తుగా సమస్యలు తెలుసుకుంటున్నాం. వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: బహిరంగ మద్యపానంపై మీ హయాంలో ఎలాంటి చర్యలు తీసుకుం టున్నారు?

జవాబు: బహిరంగంగా మద్యం తాగడం చట్టవిరుద్ధం. దానిపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. రాత్రిళ్లి పెట్రోలింగ్ నిర్వహించి మద్యం తాగేవారికి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. తద్వారా మద్యం తాగేవారి సంఖ్య కొంత మేర తగ్గుముఖం పట్టింది.

ప్రశ్న: రేషన్ మాఫియాపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: స్టేషన్ పరిధిలో 1 నుంచి 10వ తేదీ వరకు డిస్ట్రిబ్యూషన్ పాయింట్ల వద్ద నిఘా ఏర్పాటు చేసి పౌరసరఫరా, విజిలెన్స్ శాఖలతో కలిసి అనుమానిత ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: గంజాయి అదుపులోఉందా?

జవాబు: గతంతో పోల్చుకుంటే 90 శాతం అదుపులోకి వచ్చింది. మిగతా వారిపై నిఘా ఉంచాం. అనుమానితులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: డ్రంకెన్ డ్రైవ్‌పై ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: దాన్ని అరికట్టేందుకు ప్రణాళికలు తయారు చేశాం. త్వరలో కార్యాచరణ ప్రారంభిస్తాం?

ప్రశ్న: పట్టణంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై చర్యలు ఏవీ?

జవాబు: పట్టణంలో ఏడు ప్రభుత్వ షాపులు ఉన్నాయి. ఎక్కడా బెల్టుషాపులు నిర్వహించకుండా ప్రతి రోజూ సిబ్బందితో పరిశీలించి ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి కదా...ఏ విధంగా నివారిస్తారు?

జవాబు: ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నాం. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి మందుబాబులపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నాం. ప్రమాదాలు జరిగే ప్లేస్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: పట్టణంలో క్రైం రేటు ఎలా ఉంది ?

జవాబు: పట్టణంలో ప్రస్తుతం క్రైం రేటు అదుపులో ఉంది. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల్లో అక్షర జ్ఞానం పెరిగింది. తమ పిల్లలు బాగా చదువుకుని ఉద్యోగాలు సంపాదించాలనే విధంగా వారు ఆలోచిస్తున్నారు. ఇందుకోసం గొడవలు, నేరాలకు దూరంగా ఉంటుండటంతో నేరాలు చాలా వరకు తగ్గాయి.

అలరించిన నృత్యం



కడప కల్చరల్, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి): కడప నగరం రిమ్స్ సమీపంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అక్కడి సాంస్కృతిక కళావేదికపై మిస్పా మూవీ సహకారంతో ముద్ర డ్యాన్ అకాడమీ బృందం విద్యార్థులు సినిమా, జానపద, శాస్త్రీయ గీతాలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగింది.

నేటి నుంచి గౌరీదేవి ఉత్సవాలు

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంగళగౌరీదేవి ఆలయంలో గౌరీదేవి ఉత్సవాలు 11వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్ తెలిపారు. ఐదు రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. శుక్రవారం సాయంత్రం మెయిన్ బజార్‌లోని పుష్కరిణిలో దీపోత్సవం, శనివారం మంగళగౌరీదేవి నిమజ్జనం ఉంటుందని, భక్తులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

రగ్బీలో ఉర్దూ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రగ్బీ అండర్-14 బాలబాలికల విభాగంలో వేంపల్లె జడ్పీ ఉర్దూ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 9 నుంచి 10 వరకు కమలాపురం జడ్పీ హైస్కూల్లో పోటీలు జరిగాయి. ఉర్దూ హైస్కూలు విద్యార్థులు బిందుమాధవి ద్వితీయస్థానం, నూరుల్లా తృతీయ స్థానంలో నిలిచారని పీడీలు రాయుడు, చాహూన్ తెలిపారు.

పోస్టాఫీస్‌లో అకౌంట్ చేసుకోండి

వేముల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అకౌంట్ లేని వారందరు పోస్టాఫీస్‌లో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు అకౌంట్ చేసుకోవాలని వేముల సబ్ పోస్టుమాస్టర్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు, మొబైల్ తీసుకొని పోస్టాఫీస్‌కు వస్తే రూ.200 చెల్లించి అకౌంట్ ఇస్తామని, తద్వారా అన్ని ప్రభుత్వ పథకాలు పొందవచ్చన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బకాయిల చెల్లింపులో జాప్యమెందుకు : యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల చెల్లింపులో జాప్యం ఎందుకని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన క్యాదర్శులు ఎం. విజయకుమార్, మహేశ్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్నింటినీ ఆరు నెలల్లోపు పూర్తిస్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అయినా చెల్లించకపోవడం తగదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా వేధింపులకు గురి చేసిందన్నారు. తమ అవసరాల కోసం దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ము కూడా చెల్లించకుండా ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించుకుందని ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం అయినా ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లా నాయకులు రవికుమార్, సుజాతరాణి, నరసింహారావు, రమణ, శ్రీనివాసులు, కె.చెన్నయ్య, ఎజాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'దూదేకుల అభివృద్ధికి అలుపెరుగని పోరాటం'

కడప మారుతీనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దూదేకుల అభివృద్ధికి అలుపెరుగని పోరాటం చేస్తామని నూర్ బాష్ దూదేకుల సంక్షేమ రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు చిన్నరాజా అన్నారు. ఆదివారం ఎర్రముక్కపల్లెలో గల దూదేకుల సంఘం జిల్లా కార్యాలయంలో చిన్నరాజా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకుల హక్కుల సాధన కోసం శ్రమిస్తున్నామన్నారు. సంఘం రాష్ట్ర సలహాదారులు ఓబులేసు, కమాల్‌బాషా, కె.పి. హుసేన్, జిల్లా ప్రచార కార్యదర్శి ఆర్.బాబు, నాయకులు ఖాదర్‌బాషా, అలీబాషా, హోటల్‌బాషా, ఖాదరయ్య, హుసేనయ్య, అజంతుల్లా, అభినందన్ బాషా పాల్గొన్నారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు ఇమామ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నరాజా

రాష్ట్ర ఆదర్శ గురువులుగా వైవీయూ అధ్యాపకులు



విజయభారతి.. అనిత.. వీరాంజనేయరెడ్డి.. ఖాజాపీర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :వైవీయూ అధ్యాపకులు నలుగురిని ఉత్తమ గురువులుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ప్రొఫెసర్ ఎం.అనిత (ఎకనామిక్స్), ప్రొఫెసర్‌విజయభారతి (కామర్స్), వీరాంజనేయరెడ్డి (మైక్రో బయాలజీ), అకడమిక్ కన్సల్టెంట్ ఖాజాపీర్ (ఉర్దూ) ఈ జాబితాలో ఉన్నారు. ఈ నెల 11న జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో వీరిని సత్కరించనుంది.

అనాథ శవానికి అంత్యక్రియలు

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఓ అనాథ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మానవత సంస్థ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, సభ్యులు శశాంద్రకుమార్‌రెడ్డి, రామమనోహర్‌రెడ్డి, ఫిజియోథెరపీ డాక్టర్ యోగేశ్వర్‌బాబు సహకారంతో పంచాయతీ సిబ్బందిచే అంత్యక్రియలు నిర్వహించారు.

ఓటు నమోదు కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ

పులివెందుల టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) పులివెందుల పట్టణంలోని పాతసత్రం పాఠశాలలోని ఓటు నమోదు కేంద్రాన్ని ఆర్డీఓ భానుశ్రీ పరిశీలించారు. ఆదివారం పట్టణంలోని 86, 87 పోలింగ్ కేంద్రాల్లో ఓటు నమోదు కేంద్రం వద్ద ఓటర్ల నమోదు ఏ విధంగా జరుగుతుందని, ప్రజల నుంచి ఏ విధంగా స్పందన ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రజల్లో ఓటు నమోదు చేయడానికి కావాలసిన అర్హత పత్రాలను తప్పనిసరిగా దరఖాస్తుదారుల నుంచి తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎంతమంది కొత్త ఓటర్లు నమోదు చేస్తున్నారు.. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లపై అభ్యంతరాలు ఉంటే నవంబరు 28 వరకు స్వీకరిస్తారన్నారు. వాటని డిసెంబరు 24 లోపు పరిష్కరించనున్నట్లు తెలిపారు. అలాగే జనవరి 26న ఓటర్ల తుది జాబితాను ప్రజలకు ఇస్తామన్నారు.



ఓటు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ భానుశ్రీ

తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్: తులసిరెడ్డి





వేంపల్లెలో సీపీ బ్రౌన్‌కు నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, కడప: సీపీ బ్రౌన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విజయభాస్కర్

వేంపల్లె, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడపలో ఇల్లు కొనుక్కొని తెలుగు భాష నేర్చుకొని తెలుగు నిఘంటువును రచించి అంతరించి పోతున్న తెలుగు భాషకు పునరుజ్జీవం పోసిన సీపీ బ్రౌన్ తెలుగు భాషోద్ధారకుడని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతనిధి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో సీపీ బ్రౌన్ 226వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ దొరలేకపోయి ఉంటే మహా కవి వేమన ఆటవెలది పద్యాలు లభించి ఉండేవి కావన్నారు. తొలి భాషాప్రయుక్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో గత కొంత కాలంగా తెలుగు భాషకు దుర్దశ దాపురించిందని తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ జయంతి పురస్కరించుకుని బ్రౌన్ విగ్రహం వద్ద జానమద్ది విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ బ్రౌన్ చేసిన సేవలను కొనియడారు. ఏపీజీబీ ఆర్ఎం వసంత, బ్యాంకు అధికారులు శివశంకర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు పోసి.. లక్ష్యం మరచి..!



సేకరించిన చెత్తకు నిప్పు పెట్టిన దృశ్యం,
కొత్తపల్లె పంచాయతీలోని ఖాదర్‌బాద్‌లో అలంకారప్రాయంగా ఉన్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం

- కాగితాల్లోనే సంపద సృష్టి
- పంచాయతీలకు ఆదాయమేదీ..?
- సిబ్బందికి తప్పని వేతన యాతన

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ అనేది గ్రామ పంచాయతీల ప్రాథమిక బాధ్యత. పారిశుధ్య నిర్వహణ ద్వారా సంపద సృష్టించడం అనేది గ్రామ పంచాయతీల చరిత్రలో నూతన అధ్యాయంగా చెప్పవచ్చు. అందుకే చెత్త.. చెత్తకాదు సద్వినియోగం చేస్తే సంపద అన్నారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య నిర్వహణ చేయకపోతే ప్రజలు అనేక అనారోగ్య, ఆర్థికబాధలను ఎదుర్కొంటారు.

● పల్లెసీమల్లో చెత్తనిర్వహణ అధ్వానంగా ఉంది. గ్రామాల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. రహదారి పక్కనే అపరిశుభ్రత తాండవిస్తోంది. పరిశుభ్రత భారతావని కోసం అటు కేంద్రం, ఇటు రాష్ట్రం స్వచ్ఛ సంకల్పం స్ఫూర్తి ముందడుగు వేశాయి. పంచాయతీల్లో సంపద సృష్టించి అదనపు ఆదాయాన్ని పొందాలని చేపట్టిన కార్యక్రమం అమలు తీరు రాను రాను తీసికట్టుగా మారింది. చెత్తనుంచి సేంద్రియ ఎరువు తయారీ, వాటి విక్రయాలు, తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం అనేది క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) చాలా వరకు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి గడప నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్న సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు అందక యాతన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణపై చూపించిన నిర్లక్ష్యం, గ్రామ ప్రజల ఆరోగ్యానికి శాపంగా మారింది. పంచాయతీలకు అదనపు ఆదాయం దూరమైంది. నిధులు లేక చాలా చోట్ల జీతాలు చెల్లించక చేతులెత్తేశారు. దీంతో స్వచ్ఛ స్ఫూర్తి అలంకారప్రాయంగా మారింది. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి.





మూలన పడిన చెత్త తరలింపు వాహనాలు

● అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఉపాధి హామీ పథకం కింద ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్ల ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీలో స్థల సేకరణ, షెడ్ల నిర్మాణం, తడి, పొడి చెత్తను వేరుగా ఉంచే తొట్ల నిర్మాణం, చెత్త తరలింపు వాహనాల సమకూర్పు, కరెంటు, రోడ్డు, నీటి వసతులు ఇలా ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.4 లక్షల నుంచి పెద్ద పంచాయతీలకు అయితే రూ.8 లక్షల వరకు ఖర్చు చేశారు. పల్లెల్లో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించడానికి క్లాప్‌మిత్రులు, పంచాయతీల్లో అయితే కొంతమంది పారిశుధ్య కార్మికులను అదనంగా కాంట్రాక్టు పద్ధతిన నియమించుకున్నారు. ఈకేంద్రాల్లో ఒక్కో సెంటర్‌కు ఒక్కొక్క కాపలాదారుని నియామకం జరిగింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమో, కేంద్రాలపై దృష్టి సారించకపోవడమో, పంచాయతీలకు ఆర్థిక వనరులు అందుబాటులో లేక సిబ్బందికి వేతనాలు అందక నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొన్ని చోట్ల సిబ్బందికి ఆరు నెలలు, మరికొన్ని ప్రాంతాల్లో ఏడాది పాటు కూడా వేతనాలు చెల్లింపు జరుగలేదని సమాచారం. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రొద్దుటూరు మండల పరిధిలో 13 కేంద్రాలు, రాజుపాళెం మండల పరిధిలో 15 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు మండలంలోని సీతంపల్లె పంచాయతీలో స్థల వివాదం వలన నిర్మాణం జరుగలేదు. నంగనూరుపల్లె పంచాయతీలో అసంపూర్తిగా ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్ మిగిలిపోయింది. గోపవరం, దొరసానిపల్లెలో నిర్మించిన కేంద్రాలకు రహదారి సమస్యలు వెంటాడుతున్నాయి. మిగిలిన 11 కేంద్రాల్లో సేంద్రియ ఎరువుల తయారీ అన్నది కలగా మారింది. రాజుపాళెం మండల పరిధిలో 15 పంచాయతీలకుగాను 15 కేంద్రాల నిర్మాణాలు ఉన్నాయి. సిబ్బంది వేతన బకాయిలు అలాగే ఉండిపోయాయి. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో సంపద సృష్టికి దూరంగా తయారయ్యాయి.

చాలా ప్రాంతాల్లో సేకరించిన చెత్తను ఏమి చేయాలో దిక్కుతోచక నిప్పుపెడుతున్నారు. చెత్త తరలించే మూడు చక్రాల వాహనాలు పాడయ్యాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీలు అనుకున్న లక్ష్యానికి దూరంగా అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

వినియోగంలోకి తెస్తున్నాం

గ్రామాల్లో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు వాటిని సిద్ధం చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం వీటి నిర్వహణపై దృష్టి సారిస్తోంది. ఈ కేంద్రాల్లో ఫెన్సింగ్, కరెంటు, నీరు, మరుగుదొడ్ల సదుపాయాల పునరుద్ధరణ పనులకోసం ప్రతిపాదనలు పంపాం. త్వరలో ఈ తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తాం.

రామాంజనేయరెడ్డి, ఈవోపీఆర్‌డీ, ప్రొద్దుటూరు.

కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

- నకిలీ పట్టాలకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదు
- భూ ఆక్రమణలపై ప్రత్యేక బృందాలు
- ఆర్డీవో ఎ. చంద్రమోహన్



బద్వేలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాలు, భూ ఆక్రమణలు నకిలీ పట్టాలు సృష్టించడం లాంటి వాటికి పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని, భూ దందాలకు దిగాలని చూస్తే ఉపేక్షించేది లేదని బద్వేలు రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ హెచ్చరించారు. భూఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భూసమస్యలపై గ్రీవెన్‌సెల్‌లో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని మండలాల రెవెన్యూ అధికారులకు తగు సూచనలు ఇచ్చామన్నారు. బద్వేలు డివిజన్ పరిధిలో భూ కబ్జాలు, ఆక్రమణలు, వివాదాలు తదితర అంశాలపై ఆంధ్రజ్యోతి అడిగిన పలు ప్రశ్నలకు ఆర్డీవో సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: భూ కబ్జాలకు అరికట్టేందుకు చర్యలేమిటి?

జవాబు: భూ కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయి. నకిలీ పట్టాలు సృష్టించేందుకు పాల్పడితే ఉపేక్షించేదిలేదు. అవసరమైన మేరకు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే నకిలీ పట్టాలు సృష్టిస్తున్నవారిపై కేసులు పెట్టాలని పోలీసులకు కూడా సూచించాం.

ప్రశ్న: డివిజన్‌లో ఏఏ మండలాల్లో ఎక్కువగా భూ వివాదాలు ఉన్నాయి?

జవాబు: డివిజన్‌లోని అట్లూరు,బి.కోడూరు, బి.మఠం, గోపవరం, కాశినాయన మండలాలలలో ఎక్కువగా ఆక్రమణలు , వివాదాలు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చాయి.

ప్రశ్న: చెరువులు, కుంటలు, భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలేమిటి?

జవాబు: చెరువులు, కుంటలు, నీటి వనరులకు సంబంధించిన ప్రభుత్వ భూములు ఏమైనా ఆక్రమణలో ఉంటే వాటిని గుర్తిస్తాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బి.కోడూరు మండలం, ప్రభుత్వ పాఠశాలను ఆన్‌లైన్ చేసుకున్న అంశంపై చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: మీ దృష్టికి వచ్చిన భూ ఆక్రమణలు ఏవైనా ఉన్నాయా?

జవాబు: బద్వేలు డివిజన్ పరిధిలో పలు భూవివాదాలు, ఫిర్యాదులు వస్తున్నాయి. పరిష్కరించేందుకు దృష్టిపెట్టాను.

ప్రశ్న: అక్రమంగా వెలుస్తున్న లే అవుట్లపై ఏమంటారు?

జవాబు: అక్రమ లే అవుట్లు, అనుమతులు పొందకుండా వేసే వెంచర్లపై కూడా దృష్టిపెట్టాం. వీటిపై కూడా చట్టపరిధిలో చర్యలు తీసుకుంటాం. గతంలో ఆర్డీవో కార్యాలయం రాజంపేటలోఉండడంతో కొన్ని రికార్డులు అందుబాటులో లేకుండా ఉండేవి ఇప్పుడన్ని రికార్డులు అందుబాటులోకి తెచ్చుకుని భూ వివాదాలు, ఆక్రమ లేఅవుట్లు అన్నింటిపై సరైన చర్యలు చేపడతాం.

ప్రశ్న: ప్రజా విన్నపాలపై ఎలా స్పందిస్తారు?

జవాబు: ప్రజలు రెవెన్యూ పరమైన సమస్యలపై ఇచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లందరికీ ఆదేశాలు ఇచ్చాం. ఎక్కువగా భూ సమస్యలపైనే ఫిర్యాదులు అందుతున్నాయి. వీటికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నూతన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.పుట్టా సుధాకర్ యాదవ్ కలెక్టర్‌ను కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించారు.అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఆయనతో ఎమ్మెల్యే చర్చించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాగార్జున ఐటీఐ కళాశాల ఆధ్వర్యంలో గీతాంజలి హైస్కూలులో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలలో 350 మంది అభ్యర్థులు పాల్గొనగా 150 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు నాగార్జున ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు మల్లెల లక్ష్మీప్రసన్న, రోటరీ క్లబ్ సభ్యురాలు భారతి, గీతాంజలి హైస్కూలు కరస్పాండెంట్ నిహారి, చైర్మన్ శివరామిరెడ్డి, మురళి, శ్రీధర్, దామోదర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

14న జరిగే ధర్నా జయప్రదంచేయండి

పోరుమామిళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 14న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని సీపీఎం కార్యాలయంలో ఈ నెల 14న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజాపోరుకు సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, బొజ్జచిన్నయ్య, సుందరయ్య, రవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగు బకాయిలు వెంటనే చెల్లించాలి

పోరుమామిళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగు బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్రఅదనపు ప్రధాన కార్యదర్శి రమణరెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనరు సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కన్వీనరు క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చంద్రహాసరెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు పుల్లారెడ్డి, గురయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కాలం చెల్లిన మందులు పంపిణీ



బద్వేలుటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్యంవస్తే ప్రభుత్వాసుపత్రుల వైపు పరుగులు తీస్తారు. అలాంటి ప్రభుత్వాసుపత్రిలోనే కాలం చెల్లిన మందులు పంపిణీ చేస్తూ వైద్యులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం గ్రామానికి చెందిన శివానంద కుమారుడు జితేష్ కుమార్‌కు(4) జలుబు,దగ్గు, గొంతునొప్పి రావడంతో శనివారం సాయంత్రం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు,సిబ్బంది బాలుడిని పరీక్షించి సిరప్ ఇచ్చి పంపించారు. ఇంటికి వెళ్లి రాత్రి బాలుడికి సిరప్ తాపించడంతో వాంతులు, విరేచనాలు అయ్యాయి. వెంటనే వారు బాలుడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. తరువాత బాలుడికి ఆరోగ్యం కుదుటపడటంతో ఇంటికివెళ్లి ఆ సిరప్‌ను పరీక్షించగా అది కాలం చెల్లినదిగా గుర్తించారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డిని వివరణ కోరగా ఇకపై ఈ విధంగా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

దేవాంగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉట్టి నాగశయన



మాట్లాడుతున్న దేవాంగ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉట్టినాగశయన

ప్రొద్దుటూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చేనేతల్లో 18 ఉపకులాలున్నాయని కేవలం పద్మశాలీయులే చేనేతలు కారని దేవాంగులు కూడా వున్నారని వారికీ ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిండెంట్ ఉట్టి నాగశయన డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక దేవాంగ కల్యాణమండపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు ముఖ్యంగా చేనేత కులాలు మద్దతుగా నిలిచాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా దేవాంగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో దేవాంగులను పూర్తిగా విస్మరించారన్నారు. దేవాంగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా అన్యాయం చేసిందన్నారు. దేవాంగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలన్నారు. సమావేశంలో దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాగా నరసింహులు, దేవాంగ కల్యాణ మండపం అధ్యక్షుడు ఆర్‌సీ సుబ్రహ్మణ్యం, దేవాంగ సంఘం సభ్యులు కాటం బ్రహ్మయ్య, సాధుమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గోధుమ పిండి పంపిణీ

కాశినాయన నవంబరు(ఆంధ్రజ్యోతి)10: వరి కుంట్ల సమీపంలోని ఏసీ కాలనీలో ఆదివారం 25 నిరుపేద కుటుంబాలకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో 5కేజీల చొప్పున గోధుమ పిండి పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు పి.రామ క్రిష్ణారెడ్డి తెలిపారు. బెంగళూరుకు చెందిన వెంకటసాయికుమార్, స్వప్న దంపతుల కుమార్తె సాయికృప పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో ఈకార్యక్రమం చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో వివేకానంద సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసి, సంస్థ ప్రతినిధులు జయరాం,హరి తదితరులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో నిలకడగా నీటిమట్టం

కొండాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు లో ప్రస్తుతం నీటిమట్టం నిలకడగా ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో గానీ లేకపోవడంతో నీటిమట్టం నిలకడగా ఉందని ఆయన తెలిపారు.గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 26.3 టీఎంసీల నీరు నిల్వ ఉందని డీఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు అన్నారు.

చిత్రలేఖన పోటీలతో సృజనాత్మకత వెలికితీత



చిత్రలేఖనం విజేతలతో బాలోత్సవ కమిటీ నేతలు

ప్రొద్దుటూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిత్రలేఖన పోటీలు బాలల్లో వున్న సృజనాత్మకతను వెలికితీస్తాయని ప్రముఖ వైద్యుడు వరుణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ప్రైమరీస్కూల్లో జిల్లా బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గండికోట చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 200 మంది హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సృజనాత్మక పోటీలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో కష్టపడే తత్వం పెరుగుతుందన్నారు.బాలోత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు గుర్రాల గోపాల్, కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ బాలోత్సవ కమిటీ జిల్లాలో దాదాపు 5000 మంది విద్యార్థులకు ఇలాంటి అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. రాజంపేట, బద్వేలు రాయచోటి పులివెందులలో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉండేల నాగమునిరెడ్డి, కార్యవర్గ సభ్యులు నిమ్మకాయల శివరాం, గోపీనాథ్, చిత్రకళ ఉపాధ్యాయులు ఏసీ వెంకటేశ్వర్లు,యోహాను,బాలకృష్ణ,నాగరాజా చారి,నాగరాజు, సుందరం,డేవిడ్‌రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ముక్తిరామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సైకతలింగానికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం శ్రీ రామచంద్రుడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి అన్నాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ముద్దనూరు నవంబరు10 (ఆంధ్రజ్యోతి):స్థానిక సాయిబాబా మందిరం ప్రక్క వీధిలో నున్న గంగమ్మ తల్లికి ఆదివారం కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేపచెట్టుకు, గంగమ్మ తల్లి విగ్రహానికి చీరె కట్టి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మరికి పెట్టిన ఒడి బియ్యంతో అన్నం చేసి భక్తులకు వడ్డించారు.

శివనామస్మరణతో హోరెత్తిన నాగేశ్వరుని కోన

ఖాజీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని రెడ్ల వనభోజన సమితి వనభోజన కార్యక్రమాన్ని మండలంలోని నాగేశ్వరుని కొండ కిందిభాగంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శివనామస్మరణచేయడంతో కొండ కిందిభాగం మారుమ్రోగింది. కాగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ 1866వ సంవత్సరంలో కరువు విళయతాండవం చేస్తున్న సమయంలో బుడ్డా వెంగళరెడ్డి అన్నాన్ని వండించి రాసులు పోయించిన మహనీయుడన్నారు. చిన్న చిన్న పదాలతో అర్థమయ్యేలా వేమారెడ్డి పద్యాలు రాశారన్నారు. అలాగే స్వాతంత్ర్య పోరాటంలో రెడ్ల పాత్ర ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో రెడ్ల వనభోజనసమితి అధ్యక్షుడు ఒంటెద్దు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డి కులస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కోలాటం వేస్తున్న మహిళలు